


రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
జిల్లాలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పార్ట్‌టైం ఉద్యోగం అంటూ.. ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే నగదు రెట్టింపు అంటూ మాయ మాటలతో మోసం చేస్తున్నారు. 8లో



మూడోసారి బీఆర్ఎస్‌దే అధికారం
రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 8లో



కోతులతో భయం భయం
పదుల సంఖ్యలో కోతులు.. తలుపులు తీస్తే చాలు ఇంట్లోకి చొరబడి అందినకాడికి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. దాడులకు తెగబడుతున్నాయి. 9లో



అడ్డగోలు అంచనాలు!

- ధాన్యం దిగుబడుల విషయంలో వ్యవసాయశాఖ తీరు
- గత వానాకాలంలో 3.90 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా
- వచ్చింది 1.80 లక్షల మెట్రిక్ టన్నులే..
- వాస్తవ విరుద్ధమైన నివేదికలతో ఇబ్బందులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ధాన్యం దిగుబడుల విషయంలో వ్యవసాయశాఖ అంచనాలు తప్పుతున్నాయి. దిగుబడులు, మార్కెట్‌లోకి వచ్చే ధాన్యం ఎంత అనేదానిపై ఆశాఖ అంచనా వేస్తున్న లెక్కలకు.. వాస్తవంగా వచ్చిన దిగుబడులకు భారీగా తేడాలు ఉంటున్నాయి. దీంతో ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత రెండు కొనుగోలు సీజన్లలో ఈ శాఖ వేసిన అంచనాలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని తేలడమే ఇందుకు నిదర్శనం.

- గత వానాకాలం 2022–23 కొనుగోలు సీజన్‌లో 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని ఆ శాఖ అంచానా వేసి నివేదిక ఇచ్చింది. కానీ సీజనంతా కలిపి కనీసం రెండు లక్షల మెట్రిక్ టన్నులు కూడా దాటలేదు. ఈ సీజన్‌లో మొత్తం 1.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. అంటే వ్యవసాయశాఖ అంచనా వేసిన దాంట్లో కనీసం సగం కూడా రాలేదంటే.. ఆ శాఖ కాకిలెక్కలు ఎలా ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.
- గత యాసంగి కొనుగోలు సీజన్‌లోనూ ఈశాఖ అంచానాల తీరు ఇలాగే ఉంది. 2021 – 22 యాసంగి కొనుగోలు సీజన్‌లో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసింది. కానీ కనీసం లక్ష మెట్రిక్ టన్నులు కూడా రాలేదు. సీజనంతా కలిపి కేవలం 75 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగలిగారు.
- అధికారుల అంచనాలు వాస్తవాలకు కాస్త అటూ ఇటూగా ఉంటాయి. కానీ ఈ శాఖ అధికారుల లెక్కలు వాస్తవాలకు అందనంత దూరంగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ముందు జాగ్రత్తగా కాస్త అటూ, ఇటుగా పది.. ఇరవై శాతం తేడాతో అంచనా వేస్తే తప్పులేదు. కానీ ఇచ్చిన నివేదికల్లో ఏకంగా సగం కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాకపోవడం పట్ల ఆశాఖ లెక్కలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొనుగోళ్లలో ఇబ్బందులు

- వాస్తవాలకు విరుద్ధంగా అంచనా నివేదికలు ఇవ్వడంతో ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉదాహరణకు గత వానాకాలం కొనుగోలు సీజన్‌లో 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ నివేదిక ఇవ్వడంతో మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖ అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. 3.90 లక్షల మెట్రిక్ టన్నులకు సరిపడా గన్నీ బ్యాగులు తెప్పించారు. తీరా అందులో సగం కూడా ధాన్యం రాకపోవడంతో ఆ గన్నీ బ్యాగులన్నీ వృథాగా పడి ఉన్నట్లయింది.
- దీంతో ఏ జిల్లాలోనైతే గన్నీ బ్యాగులు అవసరం ఉన్నాయో ఆ జిల్లాకు వెళ్లకుండా అవసరం లేని జిల్లాకు ఈ బ్యాగులు డంప్ చేయాల్సి వచ్చింది. అవసరం ఉన్న జిల్లాల్లో గన్నీ బ్యాగుల కొరత తలెత్తగా, ఈ జిల్లాలో వృథాగా పడి ఉండటం వంటి పరిణామాలు చొటు చేసుకుంటున్నాయి.

ఈ సీజన్ అంచనా 2.30 లక్షల మెట్రిక్ టన్నులు

మరో పక్షం రోజుల్లో ప్రారంభం కానున్న యాసంగి ధాన్యం సేకరణ సీజన్‌లో జిల్లాలో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో రైతులు తమ సొంత అవసరాలు, డొమెస్టిక్ అవసరాలకు పోగా సుమారు 2.07 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని నివేదిక ఇచ్చింది. ఈసారి అంచనాలైనా కనీసం వాస్తవాలకు దగ్గరగా ఉంటాయో లేదో వేచి చూడాల్సిందే.



బిందెలో నీటిని నింపి మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఇంటింటికీ రక్షిత మంచి నీరు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రారంభించారని, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పదో వార్డు సాయికాలనీలో సాయధామం అపార్ట్‌మెంట్‌లో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మూడు భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని, త్వరలోనే పూర్తి చేసి ప్రతి ఇంటికీ మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. ఒకప్పుడు మంచినీటి ఎద్దడికి అమీన్‌పూర్ చిరునామాగా ఉండేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రతిరోజు మంచినీరు అందించగలుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్ బోయిని బాలమణి బాలరాజు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, తహసీల్దార్ దశరథ్ ఉన్నారు.

మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం



మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి

జోగిపేట(అందోల్): రాష్ట్రంలో తిరిగి అధికారాన్ని చేపట్టేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అందోల్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జోగిపేట – అందోల్ మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు విభేదాలను పక్కన బెట్టి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఎమ్మెల్యే క్రాంతికిరణ్ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారన్నారు. అనంతరం మాజీ మార్కెట్ చైర్మన్ పి.నారాయణ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. అందోల్‌కు చెందిన పార్టీ నాయకుడు పెండ గోపాల్ మాట్లాడుతూ నాయకులు, పార్టీ కార్యకర్తల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని, అర్హులైన కార్యకర్తలకే డబుల్ బెడ్రూం ఇళ్లు రాలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సయయం నుంచి పార్టీకి అండగా ఉన్న వారు ఈ రోజు కాంగ్రెస్‌లో చేరారని, ఈ విషయంలో నాయకులు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సార శ్రీధర్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పి.శివశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం, మాజీ ఎంపీపీ రామాగౌడ్, నాయకులు గోపి, వెంకటేశం, గోపాల్, గాజుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: జిల్లాలో నేటి నుంచి 13వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. జిల్లాలో 21,413 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 118 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని వివరించారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్స్, సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతాయని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్స్, ఎలాంటి ఎల్కక్ట్రానిక్ పరికరాలు అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్, ఫర్నిచర్, తదితర అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో మెడికల్ కిట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని తెలిపారు. పరీక్షల విషయంలో పిల్లలు భయాందోళనకు గురికాకుండా తల్లిదండ్రులు వారిని మానసికంగా సిద్ధం చేసి పరీక్షా కేంద్రానికి పంపాలని సూచించారు. విద్యార్థులు కూడా అనవసర భయాందోళనకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు.

దత్తగిరిలో ప్రత్యేక పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని గుంప ఆశ్రమ పీఠాధిపతి శివకుమారస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆశ్రమానికి వచ్చిన ఆయనకు ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, డా.సిద్దేశ్వర్ స్వామి ఆశ్రమ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద అభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు.



పూజలు చేస్తున్న బీదర్ పీఠాధిపతి

భూ క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

సంగారెడ్డి టౌన్: అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ 58, 59 ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించుకొని ఇళ్లు కట్టుకున్న పేదలు తమ ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు కటాఫ్ తేదీని 2014 జూన్ 02 నుంచి 2020 జూన్ 02 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు నూతనంగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 30 వరకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. లబ్ధిదారులు 2020 జూన్ 2వ తేదీలోపు సంబంధిత స్థలం వారి ఆధీనంలో ఉన్నట్లు ఆధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో అర్హులైన వారు ఈ నెల 30లోపు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగ్జీవన్ రామ్ జయంతిని విజయవంతం చేయాలి

ఈ నెల 5వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని జయప్రదం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 115వ జయంతిని పురస్కరించుకొని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్అండ్‌బీ ఆఫీస్ పక్కన గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఉదయం 9 గంటలకు పుష్పమాలంకరణ ఉంటుందని, అనంతరం నటరాజ్ థియేటర్ పక్కన కల్వకుంట రోడ్డులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దుర్గమ్మా.. దీవించమ్మా

పాపన్నపేట(మెదక్): ఎల్లలు దాటి తరలివచ్చిన భక్తులతో ఆదివారం ఏడుపాయల కిటకిట లాడింది. పూజారులు శంకరశర్మ, పార్థివశర్మ తెల్లవారు జామునే అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు దుర్గమ్మకు బోనాలతో పాటు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా రావడంతో సత్రాలు దొరకక చెట్ల కింద టెంట్లు వేసుకొని విందు చేసుకున్నారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ శ్రీనివాస్, ధర్మకర్తలు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.



దర్శనమిస్తున్న దుర్గమ్మ

రైలుకూత ఎప్పుడో?

- పనులు సగానికి పూర్తి
- ఇప్పటికే మూడుసార్లు ట్రయల్‌రన్
- సిద్దిపేట వరకు పూర్తి కావొస్తున్న పనులు
- మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ తీరిది



కుకునూర్‌పల్లి వద్ద బ్రిడ్జి నాణ్యతను పరిశీలిస్తున్న రైల్వే సేఫ్టీ అధికారులు(ఫైల్)

గజ్వేల్: ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో కీలకమైనదిగా చెప్పుకుంటున్న మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ పనులు సగానికి పైగా పూర్తికావొస్తున్నా... రైలు కూతపై ఇంకా స్పష్టత రాలేదు. మూడుసార్లు ట్రయల్‌రన్ పూర్తయినా.. ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు.

- మెదక్ జిల్లా మనోహరాబాద్ – కొత్తపల్లి వరకు రూ.1160.47కోట్లతో 151.36 కిలోమీటర్ల పొడవుతో న్యూ బ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణ పనులు చేపట్టారు.
- 2017లో పనులు ప్రారంభమయ్యాయి. ఈ లైన్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మనోహరాబాద్ మీదుగా కొత్తపల్లి వరకు, అక్కడి నుంచి పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్ లైన్‌తో అనుసంధానం కానుంది.
- ఈ లైన్ పూర్తయితే హైదరాబాద్, న్యూఢిల్లీ, కలకత్తా వంటి మహానగరాలను కలుపుతూ జాతీయ లైన్‌గా ఆవిర్భవించనుంది.
- పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్‌లైన్‌కు ఇప్పటి వరకు సికింద్రాబాద్, ఖాజీపేట మార్గం అనుసంధానంగా ఉంది. మనోహరాబాద్– కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తయితే ప్రయాణికులకు దూరభారం తగ్గనుంది.
- ఈ లైన్‌తో సిద్దిపేట జిల్లా, మెదక్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లావాసులకు ప్రయోజనం చేకూరుతుంది.
- మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట జిల్లా గజ్వేల్ మీదుగా కొడకండ్ల వరకు 43 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు పూర్తయ్యాయి.
- గజ్వేల్ రైల్వేస్టేషన్‌ను హైదరాబాద్ నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లకు ప్రత్యామ్నాయంగా మార్చి దేశంలోని ముఖ్యమైన నగరాలకు కొత్త రైళ్లను ఇక్కడి నుంచి నడపాలని నిర్ణయించడం ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం పెరిగే అవకాశం కలిగింది.
- ప్యాసింజర్ రైలుకోసం ఇప్పటికే రెండుమార్లు కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆధ్వర్యంలో 2020 జూన్ 20న, 2022 ఫిబ్రవరి 11న తనిఖీలు నిర్వహించారు.
- మొదటి తనిఖీ మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు 33 కిలోమీటర్లు, రెండో తనిఖీ గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు మరో 10 కిలోమీటర్ల వరకు కొనసాగింది.
- మొత్తంగా మనోహరాబాద్ నుంచి కొడకండ్ల వరకు 43కిలోమీటర్లు ప్యాసింజర్ రైలు నడపడానికి మార్గం సుగమమైంది.
- తాజాగా మార్చి 31న గజ్వేల్ మండలం కొడకండ్ల నుంచి 21 కిలోమీటర్ల మేర కొండపాక మండలం దుద్దెడ వరకు ట్రయల్‌రన్ విజయవంతంగా పూర్తిచేశారు.
- ఇప్పటికే 64కిలోమీటర్ల మేర దూరం రైలు నడిపేందుకు ట్రాక్ సిద్ధమైనట్లు అధికారులు తేల్చారు.
- దుద్దెడ నుంచి సిద్దిపేట వరకు కొనసాగుతున్న 10 కిలోమీటర్ల మేర పనులు పూర్తయితే మొత్తంగా 74 కిలోమీటర్ల మేర అంటే మొత్తం లైన్ పొడవులో 50శాతం పనులు పూర్తయినట్టే.
- అయినా ఇప్పటికీ రైలు కూతపై స్పష్టత లేదు.
- గతేడాది జూన్ 27న రేక్ పాయింట్ కోసం ఆర్భాటంగా గూడ్స్ బండి సేవలను ప్రారంభించించారు.
- ద్వారా రైల్వేశాఖకు మంచి ఆదాయం సమకూరుతోంది. రాబోయే రోజుల్లోనూ ఈ మార్గం గుండా ఆదాయం రానున్నట్టు భావించిన రైల్వే అధికారులు గజ్వేల్ రేక్ పాయింట్‌కు ఎరువులే కాకుండా ఇతర వ్యవసాయోత్పత్తులు, వ్యాపార ఉత్పత్తులను సిరిసిల్ల, జనగామ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్, మేడ్చల్ జిల్లాలకు తరలించాలని ఆలోచన చేస్తున్నారు.
- దీని ద్వారా రైల్వే శాఖకు గజ్వేల్ రేక్ పాయింట్ భవిష్యత్‌లో ప్రధాన ఆదాయ వనరుగా అవతరించనుందని చెప్పవచ్చు.
- ఇక్కడ గోదాముల నిర్మాణం ఇప్పటికే ఊపందుకున్నా.. సాధారణ రైళ్ల నడపటంపై నిర్లక్ష్యం ప్రదర్శించడం విమర్శలకు దారి తీస్తోంది.

త్వరలో ప్యాసింజర్ సేవలు

గజ్వేల్ రైల్వేలైన్‌పై ప్యాసింజర్ రైలు సేవలను ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీలైనంత త్వరలో ఈ లైన్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం.

– జనార్దన్, దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్

న్యూస్‌రీల్

సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న జగదీశ్

సంగారెడ్డి టౌన్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313 వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఆదివారం అధికారికంగా నివాళి అర్పించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జగదీశ్ జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ పాపన్న గౌడ్ గొప్ప యుద్ధ వీరుడని, నిజాంను ఎదిరించి అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూశాడన్నారు. అతని ధైర్య సాహసాలు, పట్టుదలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం పాపన్న గౌడ్ వర్ధంతిని అధికారికంగా జరపడం సంతోషకరమైన విషయమన్నారు. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నగేశ్, కలెక్టర్ ఏఓ మహిపాల్ రెడ్డి, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి బీరయ్య యాదవ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజు గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేశ్ గౌడ్, రాజు గౌడ్, ఎక్సైజ్ అధికారులు, వివిధ సంఘాల అధ్యక్షులు, గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిగుండాల ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

జోగిపేట(అందోల్): శ్రీ జోగినాథ రథోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భక్తులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు. మొదటగా ఆలయ పూజారులు భద్రప్ప, సుజీత్‌లు అగ్నిగుండం వద్ద పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా పూజారులు అగ్నిగుండ ప్రవేశం చేసిన తర్వాత భక్తులు వారిని అనుసరించారు. ఒక్కొక్కరు మూడు, ఐదు సార్లు ప్రవేశం చేశారు. అగ్నిగుండం ప్రవేశంతో కష్టాలు దూరమవుతాయని, అనుకున్నది సిద్ధిస్తుందని భక్తుల్లో విశ్వాసం. ఈ కార్యక్రమంలో రథోత్సవ కమిటీ కోశాధికారి రంగ సురేశ్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం ఆలయం వద్ద శివపార్వతుల కల్యాణం జరగుతుందని, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాజీ డిప్యూటీ సీఎం దామోదర హాజరు కానున్నట్లు సభ్యులు తెలిపారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అశోక్

సదాశివపేట(సంగారెడ్డి): మహనీయుల జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ జయంతులకు సందేశ్ బైక్ యాత్రలు ఏప్రిల్ 10 నుంచి నిర్వహిస్తామన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కాపాడుకోవాలని గ్రామాల్లో చైతన్యం కల్పిస్తామన్నారు. దళిత, గిరిజనులకు రిజర్వేషన్ లేకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సందేశ్ యాత్రలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.మల్లేశం, ఎస్.మహేశ్ ఉన్నారు.

క్లుప్తంగా

బావిలో పడి వ్యక్తి మృతి


ఆంజనేయులు (ఫైల్)

చేగుంట(తూప్రాన్): బావి లోపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పొలంపల్లి పెద్దచెరువు సమీపంలో వెలుగు చూసింది. ఆదివారం గ్రామస్తులు, ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పొలంపల్లికి చెందిన కొండి ఆంజనేయులు(38) పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు కూలీకి వెళ్లాడు. కూలీ పనులు ముగించుకొని పెద్దచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పక్కనేఉన్న బావిలోపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

రోడ్డుపై పడిపోయిన మహిళ

నారాయణఖేడ్: ఓ గుర్తుతెలియని మహిళ శనివారం రాత్రి ఖేడ్ పట్టణంలో రోడ్డుపై నడుస్తూ అకస్మాత్తుగా కింద పడిపోయింది. గమనించిన స్థానికులు ఆమెను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమె వివరాలు అడిగి తెలుసుకునేందుకు యత్నించగా ఆమె ఏమీ చెప్పడంలేదని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు గుర్తిస్తే ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

మోటార్ వైర్లు చోరీ


గుంతపల్లిలో మోటార్ వైర్లను కట్ చేసిన దృశ్యం

కొండాపూర్(సంగారెడ్డి): గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ వైర్లను చోరీ చేస్తున్నారు. మండల పరిధిలోని గుంతపల్లిలో శనివారం మోటార్ వైర్లను దుండగులు ఎత్తుకెళ్లారు. మండలంలోని ప్రతీ గ్రామంలో మోటార్ వైర్లను చోరీ చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోటార్ వైర్ చోరీ కేసులకు సంబంధించి పోలీసులు ఇటీవల ఓ వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు రాత్రి వేళలో పెట్రోలింగ్ చేయాలని, దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజలను నమ్మించి ఉపఎన్నికలో గెలిచారు

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


పార్టీ కండువా వేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: మాయమాటలతో ప్రజలను నమ్మించి ఉపఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇప్పటి వరకు నయాపైస పని చేసిన దాఖలాలు లేవని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎంపీ స్వగ్రామమైన దుబ్బాక మండలం పోతారం గ్రామ బీజేపీ అధ్యక్షుడు నర్సగారి కిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సుద్దాల దేవయ్య ఆ పార్టీకి రాజీనామా చేసి ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘునందన్‌రావు ఆటలు సాగవన్నారు. ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో బీజేపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామాలు చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో.. ఒకే రోజు ఐదు సైబర్ కేసులు నమోదు
- దర్యాప్తు చేస్తున్న

పటాన్‌చెరుటౌన్: ప్రజల అవసరాలను, అత్యాశను ఆసరా చేసుని సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు. పార్ట్‌టైం, ఉద్యోగ ఉపాధి, ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే నగదు రెట్టింపు రాబడి అంటూ మాయమాటలతో నమ్మబలుకుతున్నారు. అపరిచితులు చెప్పిన మాటలు నమ్మి వారు చెప్పిన విధంగా చేసి నగదును పోగొట్టుకుంటున్నారు. చివరకు పోలీసులను ఆశ్రయిస్తుండటంతో వెంటనే వారి ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు తెలుపవద్దని పోలీసులు హెచ్చరిస్తూ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వర్క్ ఫ్రం హోం పేరిట లింక్ పంపి బురిడీ

రూ.4.50 లక్షలు పోగొట్టుకున్న బాధితురాలు

ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే నగదు రెట్టింపు ఇస్తామని ఆశ చూపి ఓ మహిళను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సిటిజన్ కాలనీలో జరిగింది. బాధితురాలు గాయత్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతనెల 20వ తేదీన ఇన్‌స్టాగామ్‌లో వర్క్ ఫ్రం హోమ్ పేరిట లింక్ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలు నమోదు చేసేందుకు లింక్ క్లిక్ చేయగా ఓ వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్ ఉద్యోగమని, ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే రెట్టింపు ఇస్తామని తెలిపారు. దీంతో బాధితురాలు ముందుగా రూ.200 చెల్లించింది. ఇచ్చిన టాస్క్ పూర్తి చేయగా రూ.390 ఇచ్చారు. ఇలా టాస్క్ ఇస్తూ వచ్చి, మొత్తం రూ.4.50 లక్షలు పలు దఫాలుగా పెట్టించారు. తీరా పెట్టిన నగదు తో అదనంగా ఇస్తానని చెప్పిన నగదు ఇవ్వాలని గాయత్రి అడగటంతో సైబర్ నేరగాడు స్పందించలేదు.దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గ్రహించి పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్ టైం ఉద్యోగం పేరిట..



రూ.2.50 లక్షల మోసం

పార్ట్ టైం ఉద్యోగం పేరిట పెట్టిన నగదుకు రెట్టింపు ఇస్తామని ఆశచూపి ఓ వ్యక్తిని సైబర్ మోసగాళ్లు మోసం చేశారు. ఈ ఘటన పటాన్‌చెరులోని శ్రీసాయి నగర్ కాలనీలో జరిగింది. బాధితుడు మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 22వ తేదీన వాట్సాప్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగానికి సంబంధించిన లింక్ ఫోన్‌కు వచ్చింది. దీంతో బాధితుడు లింక్ ను క్లిక్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. ముందుగా రూ.2 వేలు చెల్లించి, వివరాలు నమోదు చేశాడు. ముందుగా వారు బాధితుడికి ఒక టాస్క్ ఇచ్చి పూర్తి చేయమని సూచించారు. దీంతో బాధితుడు పూర్తి చేయగా అతడికి రూ.2800 ఇచ్చారు. ఇలా పలు దఫాలుగా నగదు పెట్టించారు. మొత్తం రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. డబ్బులు అడిగితే స్పందించకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాట్సాప్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగమంటూ..

రూ.99 వేలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

వాట్సాప్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగమని నమ్మబలికి ఓ యువకుడిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం ముత్తంగి తన్ మైహి హోమ్స్‌లో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిబ్రవరి 18వ తేదీన హరినాయక్(24) ఫోన్‌కు వాట్సాప్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగం లింక్ ఒకటి వచ్చింది. దీంతో అతడు ఆ లింక్ పై క్లిక్ చేసి తన వివరాలు నమోదు చేశాడు. ముందుగా రూ.వెయ్యి చెల్లించాడు. దీంతో వారు యువకుడి టాస్క్ ఇచ్చి పూర్తి చేయమని చెప్పగా, పూర్తి చేశాడు. దీంతో యువకుడికి రూ.1300 ఇచ్చారు. ఈ విధంగా యువకుడి చేత నగదు పలు దఫాలుగా పెట్టుబడి పెట్టించారు. మొత్తం రూ.99 వేలు పెట్టి నగదు కావాలని బాధితుడు అడగటంతో స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టెలిగ్రామ్ వర్క్ ఫ్రం హోం లింక్

రూ.1.80 లక్షలు మోసం

టెలిగ్రామ్ ద్వారా వర్క్ ఫ్రం హోం వచ్చిన లింక్‌ను క్లిక్‌చేసి ఓ మహిళలు 1.80 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. బాధితురాలు దివ్య తెలిపిన వారు ఇలా ఉన్నాయి. ఫిబ్రవరి 9వ తేదీన సాయంత్రం టెలిగ్రామ్ ద్వారా వర్క్ ఫ్రం హోం ఉద్యోగం లింక్ ఒకటి వచ్చింది. దీంతో బాధితురాలు దివ్య తన వివరాలను నమోదు చేసి, ముందుగా రూ.500లు చెల్లించి, ఇచ్చిన టాస్క్‌ను పూర్తి చేసింది. దీంతో రూ.700 తిరిగి చెల్లించారు. ఈ విధంగా పలు టాస్క్‌లు ఇస్తూ మొత్తం రూ.1.80 లక్షలు నగదు పెట్టించారు. దీంతో బాధితురాలు తన పెట్టిన నగదు కోసం అడగటంతో స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గ్రహించి ముందుగా సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయడంతో పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాప్‌బ్లాక్ పేరిట రూ.1.09 లక్షలకు టోకరా

నారాయణఖేడ్: మీ యోనో యాప్ బ్లాక్ అయ్యిందంటూ వివరాలు రాబట్టుకొని సైబర్ నేరగాడు ఓ వ్యక్తికి భారీ మొత్తంలో టోకరా వేశాడు. నారాయణఖేడ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖేడ్ పట్టణానికి చెందిన ఉప్పరి రాజు ప్రసాద్‌కు మీ యోనో యాప్ బ్లాక్ అయ్యిందని వెంటనే మీ వివరాలు ఎంటర్ చేయండంటూ ఫోన్‌కు షార్ట్ మెస్సేజ్ వచ్చింది. అతను గూగుల్‌లో కస్టమర్‌కేర్ నంబర్ వెతికి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. వాళ్లు అడిగిన మేరకు పాన్, ఆధార్, ఫోన్ నంబర్లతోఓపాటు మెయిల్ ఐడీ వివరాలు చెప్పాడు. వెంటనే అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.1,09,025లు ఖాళీ అయ్యాయి. మోసపోయానని గ్రహించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

రామంచలో బలగం నటుడికి సన్మానం


నటుడు మధు సహదేవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. మానవ విలువలు మరిచి స్వార్థం, చిన్నచిన్న గొడవలతో దూరమవుతున్న వారికి కనువిప్పు కలిగించేలా బలగం సినిమా ఉండటంతో ఈ చిత్రాన్ని ప్రదర్శించినట్లు యూనియన్ సభ్యులు తెలిపారు. ప్రేక్షకులు ఆసక్తిగా చిత్రాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోషి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం చిత్ర నటుడు మధు సహదేవ్‌ను సన్మానించారు.

బీఆర్ఎస్ గద్దె ధ్వంసం



కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెను ధ్వంసం చేశారని మాజీ ఎంపీటీసీ సభ్యుడు తోటకూరి మల్లేశం తెలిపారు. దుద్దెడలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి గ్రామం నుంచి భారీగా ప్రజలు తరలివెళ్లడాన్ని జీర్ణించుకోలేని గుర్తుతెలియని వ్యక్తులు గద్దెను ధ్వంసం చేశారని ఆరోపించారు. దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

కేంద్రానివి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు

సీఐటీయూ జిల్లా సిద్దిపేట అధ్యక్షుడు నందబోయిన ఎల్లయ్య


నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

గజ్వేల్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, ఆ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ సీఐటీయూ ఆలిండియా కిసాన్ సభ, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కార్మిక, కిసాన్ సంఘర్ష్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లుగా విభించి కార్మికులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కార్పొరేట్‌లకు పెద్దపీట వేస్తున్నారని, దీంతో కార్మికులు రోడ్డున పడే ప్రమాదముందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు ప్రజలపై భారాన్ని మోపుతున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రంగారెడ్డి, బాబురావు, ఎల్లం, మల్లేశం, రైతుసంఘం నాయకుడు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

21న జేఏసీ ఆధ్వర్యంలో వంటావార్పు


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21వ తేదీన స్థానిక అంగడి బజార్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద జేఏసీ, అఖిల పక్షం ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు. ఆదివారం వాసవీ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు నెలల నుంచి పెంచిన పన్నులు తగ్గించాలని ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా, విజ్ఞప్తి చేసినా, రోడ్లపై ధర్నాలు, ఆందోళనలు, దీక్షలు చేసినా మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమన్నారు. వారి నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని మరోసారి డిమాండ్ చేస్తూ ఈనెల 21వ తేదీన స్థానిక అంగడి బజార్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వంటావార్పు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అఖిలపక్ష, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

- ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికతో పరిచయం
- పోలీసుల వాహన తనిఖీల్లో పట్టివేత

కొండాపూర్(సంగారెడ్డి): మైనర్ బాలికతో ఉడాయించిన యువకుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. కొండాపూర్ ఎస్ఐ వెంకటేశం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తొగర్‌పల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇన్‌స్టాగామ్‌లో ఓ అబ్బాయితో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి ఆ యువకుడు మార్చి 31వ తేదీ రాత్రి తొగర్‌పల్లికి వచ్చి బాలికను తీసుకెళ్లాడు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఆదివారం ఉదయం 10 గంటలకు బాలికను తీసుకొని హైదరాబద్ వెళ్తుండగా మల్కాపూర్ చౌరస్తాలో తనిఖీలు చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా కొండాపూర్ మండలంలోని తేర్పోల్ గ్రామానికి చెందిన ఫరీద్‌గా గుర్తించారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



'బలగం' చూసి.. జనం మురిసి


వర్గల్(గజ్వేల్): 'బలగం' సినిమా చూసేందుకు జనం ఎగబడుతున్నారు. మన నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న పరిస్థితులకు అద్దం పట్టే ఈ సినిమాకు జనంలో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఆదివారం రాత్రి వర్గల్ గ్రామపంచాయతీ వద్ద జెడ్పీటీసీ బాలూ యాదవ్ ఈ సినిమా ప్రదర్శన ఏర్పాటు చేయించారు. ఊరంతా సినిమా చూసేందుకు తరలివచ్చిన జనంతో పంచాయతీ ఆవరణ, పరిసరాలు నిండిపోయాయి. సినిమా వీక్షిస్తూ జనం మురిసిపోయారు.

రెజ్లర్ గీతారెడ్డికి సత్కారం


రెజ్లర్ గీతారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: మహిళా రెజ్లర్ కోచ్‌గా ఎంపికైన బి.గీతారెడ్డిని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సత్కరించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను సత్కరించి అభినందించారు. మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్ గ్రామానికి చెందిన రత్నమ్మ, లక్ష్మారెడ్డి దంపతుల కుమార్తె గీతారెడ్డి 2017 సంవత్సరంలో థాయ్‌లో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం నుంచి మహిళా కోచ్‌గా ఎంపికవడంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.విజయ్‌కుమార్, నర్సింహులు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: వ్యక్తి మృతి


అతీర్‌ఖాన్ మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కిష్టాపూర్ శివారు మెదక్-నర్సాపూర్ రహదారిపై ఆదివారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా మణికొండ శివపురి కానీకి చెందిన మహ్మద్ అతీర్‌ఖాన్(21) తన పల్సర్ బైక్‌పై మరో యువతితో కలిసి మెదక్ చర్చికి వచ్చాడు. తిరిగి ఇద్దరు బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కిష్టాపూర్ సమీప మలుపు వద్ద వేగంగా మెదక్ వస్తున్న కారు బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతీర్‌ఖాన్ అక్కడికక్కడే మృతి చెందగా, యువతికి తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స చేసి వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్నవారు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద స్థలాన్ని మెదక్ సీఐ విజయ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. రెండు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు,ఆటో ఢీ..

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లి స్టేజీ వద్ద ఆదివారం సాయంత్రం కారు, ఆటో ఢీ కొనడంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. హుస్నాబాద్‌నుంచి అక్కన్నపేట వెళ్తున్న కారు, హుస్నాబాద్ వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని గుర్జకుంటకి చెందిన నంగి అనిల్(29) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. మృతుడు గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన చేర్యాల జెడ్పీటీసీ సభ్యుడు శెట్టె మల్లేశం హత్య కేసులో ప్రధాన నిందితుడికి సహకరించిన అనుమానితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మూడోసారి బీఆర్ఎస్ పార్టీదే అధికారం


మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మండలంలోని రాజక్కపేట, బల్వంతాపూర్, అప్పనపల్లి, నర్లెంగడ్డ, పద్మశాలిగడ్డ, హసన్‌మీరాపూర్, పెద్దగుండవెల్లి, తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి, హబ్సిపూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలకు అప్పనపల్లి గ్రామం వద్ద ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మల్లన్న సాగర్ ద్వారా వరి పంటలకు నీళ్లు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీడు భూములన్నీ సాగులోకి వచ్చి పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్నాయన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా ఫించన్లు, కేసీఆర్ కిట్, రైతు బంధు, బీమా పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో రైతులకు ప్రవేశ పెడుతున్న పథకాలను దేశ వ్యాప్తంగా అమలు చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ స్థాపించాడన్నారు. బీజేపీ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలోలేరని తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యకర్తలు అధైర్య పడకూడదని, ఏ ఆపద వచ్చినా వెన్నంటి ఉంటానన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన దేశపతి శ్రీనివాస్‌ను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ సన్మానించారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మండలంలోని రాజక్కపేట గ్రామం నుంచి బైక్ నడుపుకుంటూ కార్యకర్తలతో వచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఫారూఖ్‌హుస్సేన్, దేశపతి శ్రీనివాస్, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కైలాశ్, ఏఎంసీ చైర్మన్ జ్యోతికృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, గ్రామ సర్పంచ్ లక్ష్మీపోచాద్రి, ఎంపీటీసీ లావణ్యయాదగిరి, సర్పంచ్ రాజిరెడ్డి, సమ్మేళనం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు బక్కి వెంకటయ్య, వెంకట నర్సింహారెడ్డి, మనోహర్‌రావు, రాధకృష్ణశర్మ, ఎల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం

హాథ్ సే హాథ్ జోడో నియోజక వర్గ ఇన్‌చార్జి ప్రమోద్ కుమార్


మాట్లాడుతున్న హాథ్ సే హాథ్ జోడో నియోజక వర్గ ఇన్‌చార్జి ప్రమోద్ కుమార్

కొండపాక(గజ్వేల్): ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటా సౌభాగ్యం కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని హాథ్ సే హాథ్ జోడో నియోజక ఇన్‌చార్జి ప్రమోద్ కుమార్ కోరారు. కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరిస్తూ కాంగ్రెస్ మెనిఫెస్టోపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో పేదలు సొంతింటి కలను సాకారం చేసుకునేలా ఇందిరమ్మ పథకంలో ఇంటి నిర్మాణాలు చేయించిందన్నారు. కాంగ్రెస్ పాలనలో సామాన్యులు కొనుగోలు చేసుకునేలా నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచకుండా నియంత్రించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన డబుల్ బెడ్రూం పథకం కమీషన్ ఇచ్చేవారికే కట్టబెట్టిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ హామీ ఇచ్చి రెండు పర్యాయాలు గడుస్తున్నప్పటికీ అమలు కాలేదన్న విషయాన్ని ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విరుపాక ప్రణవీరెడ్డి, కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహాచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమణకు తరలిన స్వాములు


కొండగట్టుకు వెళ్తున్న స్వాములు

మద్దూరు(హుస్నాబాద్): మండలానికి చెందిన హనుమాన్ మాలధారణ స్వాములు మాలవిరమణకు ఆదివారం కొండగట్టుకు తరలివెళ్లారు. మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామంలో మాలదారులు హనుమాన్ ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఇరుముడి నెత్తిన పెట్టుకొని గ్రామంలో హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. శోభాయాత్ర అనంతరం కొండగట్టుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చెవిటి మహేశ్, గోపాల్, ఉప్పుల సత్యనారాయణ, మేక కిష్టయ్య, బండి యాదగిరి, కీర్తి చంద్రమౌళి, నారాదాసు అశోక్, అత్కూరి పరశురాములు తదితరులు ఉన్నారు.